# తిలోత్తమీయం

తిలోత్తమ సంబంధం వచ్చిన రోజు నుంచి కొండన్నకు మనసులో ఒక ప్రధాన వికారం పుట్టి పెరిగింది. దాన్ని ఇంగ్లీషులో ''ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్'' అని విశ్లేషించవచ్చు. ''తాను ఒక తక్కువ వాడికిందే లెక్క కదా?'' అని మనసును, శరీరాన్ని ఒకేసారి కుంచింప జేసే వివశత్వానికి లోనయ్యాడు కొండన్న.

వాల్మీకి ఋష్యమూక పర్వతాన్ని ఎక్కడం ఎంత కష్టమని చెప్పాడో అంత కష్టపడి పదవతరగతి అనే పర్వతాన్ని ఎక్కి, మళ్లీ క్రిందకు దిగిన కొండన్న ఆ మహా ప్రయత్నంలో సంభవించిన ఆయాసం తీర్చుకోవడానికి, నాలుగు, ఐదు సంవత్సర ములు విశ్రాంతి తీసుకున్నాడు. తరువాత ప్రభుత్వంలో ఒక పెద్ద ఆఫీసరు సహా యంతో హైదరాబాదు మనిసిపల్ కార్పోరేషన్‌లో ఒక చిన్న ఉద్యోగంలో ప్రవేశిం చాడు. ఆ పెద్ద ఆఫీసరు, ఈ చిన్న కొండన్నను ఇంత పెద్ద సహాయము చేయడానికి తగిన కారణమేమైనా వుందా అని ఎవరైనా ఆలోచించడం సమంజసం. ఎందుకంటే, ఈ కాలంలో చిన్నచిన్న ఉద్యోగాలకు కూడా ఇరవైఐదు, ముప్పై వఉకు ఇవ్వడానికి సిద్ధపడే వాళ్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అందువల్ల ఒక నయాపైసా కూడా తీసుకోకుండా, ఉద్యోగం ఇప్పించిన ఒక మహాత్ముడు ఈ ఊళ్లో ఈరోజు బ్రతికి వున్నాడంటే ఆయన ప్రత్యక్ష దర్శన మహాభాగ్యం అందరికీ కలుగపోయినా కనీసం ఆయన 'ఫొటో' చూడటానికి ఆయన గురించి విన్నవారికి ఎంతో మందికి ఆరాటంగా ఉంటుంది. కొండన్నకు ఈ మహద్భాగ్యాన్ని ప్రాప్తింపజేసిన వ్యక్తి ఎవరో కాదు. రోజూ తెల్లకోటూ, తెల్లప్యాంటు, గాంధి టోపీలాంటి ఒక తెల్లటోపీ ధరించి ముప్పై సంవత్సరా లపైబడి ప్రభుత్వానికి నిస్వార్థ సేవను అందించి ఈ మధ్యనే పెన్షన్ పుచ్చుకున్న సాక్షాత్ కొండయ్యనే - కొండయ్యకు ఏకైక సంతానం కొండన్న.

వివాహానంతరం ఐదారు సంవత్సరాల వఉకు ఎంతోమంది దేవతలకు, లంచాలి చ్చిన ఫల స్వరూపమే కొండయ్యకు జన్మించిన కొండన్న. ఆ సుపుత్రుడు కొండన్న అవతారం కార్బన్ కాపీలాగా వుంటే. ఆ బిడ్డకు కొండన్న అని పేరు పెట్టడానికి కొండయ్యకు వేరే కారణం ఏమీ అవసరం లేదు కదా!! అయితే పాపం బాలారిష్టాలు, ఆ బాలుడిని గూడా బాగా బాధపెట్టాయి. బడివఉకు వెళ్లడానికి శక్తి ఉందా లేదా అనే అనుమానం వల్ల, బడికి పంపించడమనే ఘోర కృత్యాన్ని వాళ్లు చేయలేదు. అందుచేత కొండన్న తన ఏడు, ఎనిమిదేళ్ల మధ్య వయస్సులో ఒక శుభ ముహూర్తాన ప్రప్రథమంగా మాతాపితా సమేతంగా, ఒక విద్యాలయంలో అడుగు పెట్టాడు. అంతలో పదీ, వంద వఉకు లెక్క పెట్టాడు. అ, ఆ, ఇ, ఈ, క, చ, ట, త, ప, లు చదవడం ఆ బాలకునికి వచ్చిందంటే అది కొండయ్య దంపతులకు చాలా గర్వకారణమయింది. అంత సమర్థుడయిన ఆ విద్యార్థి తర్వాత ఏవో రెండు క్లాసుల్లో

తప్పి పోయాడో, అది అతని గురువుల గురుత్వ లోపం అనే ఆ తలిదండ్రులు గట్టిగా నమ్మారంటే, అందులో ఆశ్చర్యమేమీ లేదు. ఆ విధంగా పాత రోజులలో ఓటు హక్కు వచ్చే వయసులో మన కథానాయకుడు పదవ తరగతి పాసుకావడం జరిగింది. దాని సర్టిఫికెట్ చేతికి వచ్చిన రోజే, ఆ యువకుణ్ణి ''ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజ్''కి తీసుకొనిపోయి పేరు రిజిస్టర్ చేయించారు. అయితే ఉదాహరణ కొండయ్య కార్యక్ష మత ఎంతటిదో అందరికీ అవగతమవుతుంది గదా? మరుసటి రోజునుంచి ప్రతిదినం కనీసం ముప్పైసార్లు నమస్కారం అందుకుంటున్న ఆ పై అధికారి ముందు తన ''మెదుల్లా ఆబ్లాం గేటా''ను గీరుతూ తన ఏకైక సంతానం యొక్క భావి జీవితం గురించి క్రమం తప్పకుండా ప్రార్థనలు చేయడం కొండయ్య అలవాటు చేసుకొన్నాడు. ఆ పై అధికారి, క్షిప్రసాది ( శీఘ్రంగా ప్రసన్నం అయ్యేవాడు) అయినా గూడా ఉద్యోగం ఇప్పించడం అంత సులువైన విషయం కాకపోవడం వల్ల, పంచ వార్షిక ప్రార్థన వల్లనే కొండయ్య కొడుకు కొండన్నకు ఆ ఉద్యోగం దొరికింది. తన రిటైర్‌మెంట్ అయ్యేలోపల, తన కుటుంబంలో ఇంకొక ప్రభుత్వోద్యోగి పుట్టడంవల్ల కలిగిన అత్యుల్లాసములో, ఆ సీనియర్ ధఫేదార్ తన ఏకైక సీనియర్ ధర్మదార (ధర్మప త్ని)తో ఒక వారం రోజులు పాటు సరికొత్తగా ''మధువిధు'' (హనీమూన్) పండుగ చేసుకున్నారు. ఆ విషయం ఆ జూనియర్ ఉద్యోగస్తుడు కొండన్నకు కూడా తెలిసిపోయింది. ఒక సంవత్సరం లోపల ఒక రోజు సాయంత్రం వివర్ణ వదనంతో, చేతిలో రకరకాల పుష్పమాలతో కొండయ్య ఇంటికి చేరాడంటే ఉద్యోగ విరమణ చేసిన ఆరోజు ఆఫీసులో ఏమేమి జరిగిందో ప్రస్తావించ నవసరం లేదు.

రిటైరయిన తరవాత కొండయ్య అతని భార్య, నిజామాబాద్‌లో వాళ్ళ స్వగ్రామా నికి పరిసర ప్రదేశాలకూ చాలాసార్లు వెళ్లారు. తమ కుటుంబ ప్రతిష్ఠను నిలబెట్టే ప్రభుత్వ ఉద్యోగియైన కొండన్న అనే యువకిశోరానికి దాదాపు సరితూగగల ఒక తరుణీమణిని వెతకటానికే, ఆ వృద్ధమిధునాలు రెక్కలు కట్టుకొని అక్కడకి వాలారు. చివరకు ఒక మధ్య తరగతి కుటుంబం నుంచి తిలోత్తమ అను పేరుగల ఒక సుందర ధామము ఆ ప్రభుత్వ ఉద్యోగస్తుల ( రిటైరయినవా మరొకరు ప్రొబేషన్ దాటిన వారు) సంతృప్తి భావన, భవ్యంగా, దివ్యంగా అడుగు పెట్టింది.

ఇక్కడ నంచే మన కథ మొదదలవుతుంది. అయితే, ఇప్పటివరకు చెప్పినదంతా సినిమాలోలాగ ''ఫ్లాష్ బ్యాక్''.

పెళ్లిచూపుల సమయం నుంచే కొండన్నకు గుండెదడ మొదలయింది. అమ్మాయి ఇల్లు తన ఇంటికంటే ఎంతో అందంగా వుంది. కాని తన ఇల్లు సిటీలో వుంది. ఇది గ్రామంలో ఇల్లు కదా అని సరిపెట్టుకోవడం వల్ల అతని గుండెదడ ఫస్ట్‌గేర్‌లోనే నడిచింది. కాని అమ్మాయి, అతని ముందు ప్రత్యక్షం కావడంతో, ఆ దడ రెండు

మూడు గేర్లను పట్టించుకోదంటే సరాసరి నాల్గవ గేరులో అంటే టాప్ గేర్‌లో నడడం, కాదు, పరుగెత్తడం మొదలుపెట్టింది. రాజ్ పుట్‌లా వున్న తన శరీరం ఆ స్వర్ణ విగ్రహానికి నచ్చుతుందా? ఇంత అందంగా వున్న అమ్మాయి పరిసర ప్రదేశాలకు కూడా నేను వెళ్లకుండా వుండాల్సింది. కాని, తనకు, ఈమె గురించి, ఎలాంటి వివరాలు ముందుగా తెలియవు గదా! ఏమైనా అవమానకరంగా ఉంది. మొదటి పెళ్లి చూపులలోనే తాను తిరస్కృతుడవుతున్నట్లు అతనికి అనిపించింది.

కానీ, అతను అనుకున్న దానికి విరుద్ధంగా జరిగింది.

అమ్మాయికి కొండన్న నచ్చాడు. పెళ్లి వైభవంగా జరిగింది.

వాళ్ల మొదటి రాత్రి...

భయంతో, భీతితో అతను అడిగాడు --- ''తిలోత్తమా! నిన్ను నేను 'ఉత్తమా' అని పిలవ్వచ్చా?'' కాని....

''సిగ్గు అనే సున్నటి మస్లిన్‌తెర వేసుకొని ఆమె ముద్దుముద్దుగా గొణిగింది. దానికేముంది, నేను ఉత్తమనే కదా... కాని...

''ఏంటి? కాని అని చెప్పి ఆపేశారు'' కొండన్న గుండెదడ మళ్లీ టక్ టక్ మంటూ మొదలయింది.

''ఏంటి? మీవాళ్లు మీకిలాంటి పేరు ఎందుకు పెట్టారు? రాజేంద్రుడని కాని, లేక మహేంద్రుడని గాని పెట్టివుంటే ఎంత హాయిగా వుండేది. అయితే, ఇంక మార్చుకోవడానికి వీలు లేదా?''

తిలోత్తమ అన్న మాటలు కొండన్న ఆలోచనల సుడిలో పడి గడ్డిపోచల్లాగ తిరగడం మొదలుపెట్టాయి. ఈమె, ఇంత అందగత్తె అయిన ఈమె, ఆ వరిజినల్ తిలోత్తమ యొక్క సహస్ర అవతారమో లేదా దశసహస్ర అవతారమో తప్పనిసరిగా అయి ఉంటుంది. ఎన్నో యుగాల తర్వాతకూడ ఈమెను ఆ ఇంద్రుడి మీద ఉండే మదనతాపం తగ్గలేదా? అందుకే ఇలా మాట్లాడుతోందా... పోనీ... అయితే... తాను ఎవరు? అప్పటి ఇంద్రలోకంలో పాలు అమ్మేవాడా? లేక ఇంద్రుడికి డ్రైవర్‌గానో లేక ఇంద్రలోకంలో ట్రాఫిక్ కానిస్టేబిల్ గానో పనిచేసి పొరపాటున ఈ భూమ్మీద తిలోత్తమకు దొరికిపోయానా? అనుకున్నాడు. అయినా తిలోత్తమను వదలలేక తన పదవ తరగతి సర్టిఫికెట్లలోను, ప్రభుత్వ రికార్డుల్లోనూ తన పేరు ఇలాగే వుండటం వల్ల ఇక దాన్ని మార్చడం కష్టం' అని ఆమెకు మెల్లగా చెప్పాడు.

దానికి ఆమెనుంచి ఎలాంటి వ్యతిరేక స్పందన రాలేదు.

ఆమె ఏం చెప్పినా అతనికి అది నచ్చుతుంది. ఆమె అధరాలనుంచి ప్రస్ఫుటమయ్యే

దంతా ఆయనకు అమృతమే. తన తలిదండ్రులను ఆమె బాగానే చూచుకుంటుంది. వాళ్లతో మాట్లాడేది కొద్దిగా తక్కువ అయినా కూడా వాళ్ల విషయాలన్నీ చాలా శ్రద్ధగా చూచుకోవడంలో ఎలాంటి లోపం లేదు. ఆ ఇంటిలో అత్తా కోడళ్ల మధ్య యుద్ధం జరగడానికి ఎలాంటి ఆస్కారం లేదు. కారణమేమిటంటే ఒకే ఒక కోడలని అత్త సొంత కూతరులాగ చూచుకుంటుందన్న మాట. ఆ కోడలు కూడా అత్తగారిని తన తల్లిలాగ ప్రేమిస్తూ గౌరవిస్తూ వుండేది.

కొండయ్య పెన్షన్, కొండన్న జీతం కలిపితే వచ్చే మొత్తంతో ఆ కుటుంబం ఒక మోస్తరుగా సమృద్ధిగానే గడిచేది. కొండయ్య రిటైర్ అయినప్పుడు వచ్చిన ప్రావిడెంట్ ఫండు, ఇన్సూరెన్స్, గ్రాట్యుటీల ద్వారా వచ్చిన పెద్ద మొత్తంతో ఇంటిని అందంగా తయారుచేశారు. అంతేకాక శ్వేత, శ్యామ టెలివిజన్ స్థానంలో రంగుల టెలివిజన్ వచ్చింది. ముఖ్యంగా చల్లని నీళ్లు త్రాగటానికి ఒక చిన్న రిఫ్రిజిరేటర్ గూడా రావడంతో, ఆ మామూలు మనుషులున్న కాలనీలో ఈ ఇల్లు ఒక వి.ఐ.పి ఇల్లుగా రూపాంతరం పొందింది. తరవాత కొండన్న పెళ్లి జరిగింది. ఒక దేవలోక సుందరి, ఆ భవనంలోకి అడుగు పెట్టడంతో, తలకు పైన ఫ్యానులు, వంట ఇంట్లో గ్యాస్ స్టవ్, కూరలు త్వరగా తయారుచేయడానికి కావలసిన మిక్సీ ఇలాంటివి కూడా ప్రత్యక్షమయ్యాయి. భవన ప్రాంగణంలో కొండన్న కోసం కొన్న, కొత్త స్కూటర్ చెవులు నిక్కబొడుచుకున్న ఒక ఆకు పచ్చ కుందేలు లాగా, దూకటానికి, పరిగెత్తటానికి సదా సన్నద్ధంగా వున్నట్టు నిలబడి వుంది. కొత్త కోడలి అందాన్ని చూసి ఆనందించటానికి లేదా ఆ ఇంటి సుఖ సౌకర్యాలు చూసి ఈర్ష్య పడటానికి ఇరుగుపొరుగు వారు ఆ ఇంటికి రావడం తరచుగా జరిగేది. ఆ విషయం గురించి ఆ ఇంటివాళ్లు చాలా గర్వపడే వాళ్లు.

కొండయ్యకు వచ్చే పెన్షన్, వచ్చింది వచ్చినట్టుగా అతని భార్య చేతిలో పెట్టే వాడు. కొండన్న కూడా ఆ విషయంలో ఏం తక్కువ వాడు కాదు. ప్రతి మొదటి తారీఖు అతని జీతం తిలోత్తమ చేతికి అందించడంలో ఆలస్యం చేసేవాడు కాదు. ఆ మంచి అత్తగారు, తనకు వచ్చిన డబ్బు అలాగే కోడలికి అప్పజెప్పేది. ఎందుకంటే ఒక కుటుంబంలో లోపల ఇద్దరు ఆర్థికామాత్యులు వుండడం మంచిది కాదు అన్న సత్యాన్ని ఆమె అర్థం చేసుకుంది. ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న తిలోత్తమ, బడ్జెట్ విషయంలో ఎంతో సమర్థురాలు.

మూడు సంవత్సరాలు గడిచిన తరువాత కూడా కొండన్నకు, ఆ కొత్త అమ్మాయి పైన కొద్దిగా కూడా మోజు తగ్గలేదు. ''నిన్ననే మన పెళ్లి అయినట్టు అనిపించడం లేదా?' అని కొండన్న ప్రేమ పురస్సరంగా తన వ్రేళ్లతో ఆమె జుట్టు దువ్వుతూ అడిగితే ''ఛ, ఛ మిమ్మల్ని చూస్తే పెళ్లఅయిన కుర్రవాడని ఎవరైనా అనుకుంటారా?'' అని మువ్వలు మ్రోగే మధుర నాదంతో నవ్వుతూ ఆమె ఎదురు ప్రశ్న వేసేది.

ఇంతలోపల ''ప్రతి ప్రసవానికి అందం రెండింతలు పెరుగుతుంది'' అన్న ప్రకటనకు ఆమె రెండుసార్లు మోడల్ కావటం జరిగింది. ఇద్దరూ మగ పిల్లలే. రెండవ ప్రసవం తర్వాత 'ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్' చేసుకుంటానని తిలోత్తమ పిడివాదం చేసినా గూడా ''నాకు నీ పోలికలున్న ఒక కూతురు తప్పకుండా కావాలి'' అని కొండన్న ఎదురు పిడివాదం చేయడంవల్ల, సరే ఇంకొక ''ట్రయల్'' చేసి చూద్దాం అని తిలోత్తమ అర్ధసమ్మతి సూచకమైన మాటలతో తెలియజేసిందని అతను అనుకున్నాడు.

ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. మొదటి కొడుక్కి నాలుగేళ్లు, రెండవ వాడికి రెండున్నర. మొదటి వాడు ఇంగ్లీషు మీడియంలో కె.జి. క్లాసు చదువుతున్నాడు.

కొండన్న, తిలోత్తమ మధ్య ఎప్పుడూ ఎలాంటి అభిప్రాయ భేదాలు రావు. అతను చెప్పేది ఏదైనా ఆమెకు నచ్చనట్లయితే, అతను తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు. ఆమె ఏమి చెప్పినా, అది నిన్నటి నుంచే అతనికి స్వీకార యోగ్యంగా వుంటుంది. అలా వున్నప్పుడు, ఇంక గొడవలెలా వస్తాయి? ఎంతసేపు మాట్లాడుతూ కూర్చున్నా వాళ్లకు సమయం చాలదు. ఆఫీసులో జరిగే వివరాలన్నీ, అదే రోజు రాత్రి ఆమెకు సవివరంగా చెప్పేవాడు.

అలాంటి కొన్ని వివరణలలో నుంచి తిలోత్తమకు ఒక నవ్యాశయము మొలకెత్తింది. కొండన్నతో పనిచేసే కొందరు ఆటోరిక్షాలు కొని వాటినుంచి మంచి ఆదాయం సంపాదిస్తున్నారట.

''అయితే మనం కూడా ఒక ఆటోరిక్షా కొంటే బాగుంటుంది కదా?''

''దానికి కావల్సిన డబ్బు మన దగ్గరెక్కడ వుంది? ఇప్పుడు దానికి దాదాపు ముప్పై వేలవుతుంది.''

''దానికేముంది, మీ స్కూటర్ మంచి కండిషన్‌లో వుంది కదా. అది అమ్మితే, ఒక పది రాదా?''

''ఉత్తమా! అయితే నేనిక బస్సులో పోతే చాలు అనేనా నీ అభిప్రాయం?''

''అదెందుకంటే? దర్జాగా ఆటోరిక్షాలో పోవచ్చు గదా? మన పిల్లలకు కూడా స్కూలుకు వెళ్లడానికి, రావడానికి సౌకర్యంగా వుంటుంది. ఇవన్నీ అయిపోయిన తర్వాత, మిగిలిన సమయంలో, వచ్చే ఆదాయం చాలు మనకు.''

''ఒక మంచి డ్రైవరు దొరికితేనే మనకేదైనా లాభం వస్తుంది''. అతనొక దుర్మార్గుడయితే గోవిందా, గోవిందా.''

''మీ స్నేహితులు ఎంతో మంది నడిపిస్తున్నారు కదా! వాళ్లలో ఎవరైనా గోవిందా కొట్టారా'' ఒక మంచి డ్రైవర్‌ను వెతికి తెచ్చుకోవాలి. మన ఖర్చులు కూడా

పెరుగుతూ వస్తున్నాయి. రెండోవాడు కూడా స్కూలుకు వెళ్లడం మొదలు పెడితే ఇప్పుడు వచ్చే డబ్బు సరిపోదు. అందుకే నేను ఈ ఐడియా చెప్పాను''.

''అయితే ఆటోకు కావలసిన డబ్బు ఎలా వస్తుంది?''

''అదంతా ఎలాగైనా సిద్ధం చేద్దాం''

ఆ విధంగా కొండన్న ఒక క్రొత్త ప్రయోగానికి సిద్ధపడ్డాడు. ఒక నెల లోపల ఆ భవన ప్రాంగణంలో, ఆకు పచ్చ కుందేలు స్థానంలో ఒక పసుపు పచ్చ గేదె చోటు చేసుకుంది.

ఆరోజు ఆ కుటుంబంలో ఆనందం పొంగి పొర్లింది. కొండన్న చేయాల్సిన పనులు ఇంకా పూర్తి కాలేదు. వాళ్ల అదృష్టం వల్ల ఒక మంచి డ్రైవరు దొరికాడు. అతనే ఈ బ్రాండ్ న్యూ ఆటోరిక్షా కూడా తీసుకుని వచ్చాడు. ఇంకా దానికి నంబరు ప్లేటు రాయించాలి. ఆటోరిక్షా వెనక భాగములో రాయించాల్సిన కొన్ని పెద్ద విషయాలు న్నాయి. దానిని ఫట్ ఫట్ అని స్టార్ట్ చేసి అతను బయటకు దూసుకునిపోయాడు. రాత్రి చాలా ఆలస్యంగా అతను దానిని తిరిగి తెచ్చాడు.

మరునటి రోజు ఉదయం వాహన పూజ అయిపోయిం తర్వాత తిలోత్తమ చెప్పింది - ''మొదటి ట్రిప్పులో కొండన్న ఆఫీసుకే వెళ్లాలని. కాదు, మొదటి సవారీ తిలోత్తమనే చేయాలని కొండన్న పిడివాదం. చివరకు ఆ దంపతులు వారి ఇద్దరు పిల్లలు రెండు కిలోమీటర్లు అటూ, ఇటూ ప్రయాణం చేయడమే కాక మీటరు సూచించిన రేటు కొండన్న డ్రైవరుకు ఇవ్వడం కూడా జరిగింది. ఎందుకంటే మొదటి ట్రిప్పు ఉచిత ప్రయాణమైతే అది శుభసూచకం కాదు.

దాదాపు ఒక నెల మంచిగా గడిచిపోయింది. ఆటోరిక్షా ద్వారా, ఒక మోస్తరు మంచి ఆదాయము రోజూ వస్తుండేది. ప్రతి రాత్రి 10 గంటలకు గాని 11 గంటలకు గాని, ఆ డ్రైవరు ఆటోను ఇంటి ముందు వదలి వెళ్లిపోతాడు. ప్రొద్దున్నే 6 గంటలకు వచ్చి తన పని మొదలు పెడతాడు. కొన్ని కొన్ని రోజుల్లో అర్ధరాత్రి డ్రాప్పులు కూడా వుండేవి. ఏమైనా గూడా డ్రైవరు మాత్రం మంచివాడు.

ఒకరోజు పిడుగు పడింది. కాని అది చాలా విచిత్ర రీతిలో పడింది. కొండన్న ఆఫీసుకు బస్సులో వెళ్లి వచ్చేవాడు. ఒక పాస్ తీసుకొని వెళ్లడమే చవుక అవుతుందని భార్యను ఒప్పించాడు. ఒక రోజు సాయంత్రం అతను ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు తిలోత్తమ రూపం, భావం అంతా చాలా వ్యత్యాసంగా వున్నట్టు ఒక్క చూపులోనే గ్రహించగలిగాడు. సంభ్రమంతో దగ్గరకు వెళ్లి ఆమె నుదుటి మీద చేయిపెట్టి చూశాడు. జ్వరంగా వుంది. ''ఏమైంది ఉత్తమా? ఏమైంది? చాలా వేడిగా వుందే. వెంటనే పోయి డాక్టరును చూద్దాం'' అని అతను గాబరాగా అన్నాడు.

''అంత జ్వరంగా ఏమీ లేదు. డాక్టరును చూస్తే ఈ జ్వరం తగ్గదుకదా. ఏం చేయాలో నాకు తెలుసు.''

తిలోత్తమ భావభేదం చూసి అతను భయపడిపోయాడు. మళ్లీ ఆమెను ఏమడగాలి? తను ఏం చేయాలో అనే కార్యక్రమాల గుఱించి అతనికేమీ తోచలేదు. తన భార్య ఇంత ముభావంగా వుండటం ఇది మొదటిసారి. దానికి కారణం ఏమిటో, ఎంత ఆలోచించినా అతనికి అర్థం కాలేదు. అతను రహస్యంగా, దాన్ని గుఱించి తల్లిని అడిగాడు. ఆ రోజు మధ్యాహ్నం తరవాత, ఇద్దరు ముగ్గురు స్నేహితురాళ్లు వచ్చారని, వాళ్లు పెద్దగా నవ్వడం జరిగిందని, వాళ్లు వెళ్లిన తర్వాత, తిలోత్తమ ఆమె గదిలోకి పోయి తలుపులు మూసుకుందని, చిన్న కొడుకు ఏడుస్తున్నా ఆమె బయటకు రాలేదని, పెద్దవాడు స్కూలు నుంచి తిరిగి వచ్చి తలుపులు తట్టి పిలిస్తేనే ఆమె బయటకు వచ్చిందని, ఏడ్చి ఏడ్చి ఉబ్బిపోయిన ఆమె ముఖం చూసి, ఏం జరిగిందని తను అడిగానని ''ఏమీ లేదమ్మా నాకు చాలా తలనొప్పిగా వుంది'' అని మాత్రమే ఆమె సమధానం చెప్పిందని ఆమె కొండన్నతో చెప్పింది. రాత్రి ఏదో భోం చేసినట్టుగా చేసి అతను పడుకున్నాడు. నిశ్శబ్దం రాజ్యమేలుతున్న ఆరాత్రి, అతనికి ఊపిరి తీసుకోవడం కష్టమైనట్టు అనిపించింది. నిద్రరాక అటూ ఇటూ పొర్లుతున్నాడు. భారంగా వున్న ఆమె ముఖం చూసి, ఏమీ అడగడానికి అతనికి ధైర్యం చాలలేదు.

వేకువ జామున అతను ఉలికిపాటుతో లేచాడు. తను ఎప్పుడు నిద్రపోయాడో గుర్తు రాలేదు. కాని, తిలోత్తమ మంచంపై లేదు. అత్యంత సంభ్రమంతో పడక గదినుంచి బయటకు వచ్చాడు. ప్రాంగణంలో ఏదో శబ్దం వినిపించింది. బయటకు వచ్చి మసక చీకట్లో చూస్తే, జుట్టంతా విరబోసుకొని, ఆటో వెనుక బాగంలో అందంగా రాసి వుంచిన అక్షరాల్ని ఒక కత్తితో చెరిపేస్తోంది. ఆ స్థితిలో ఆమెను చూసి, అతని భయం పదిరెట్లు ఎక్కువయింది. ఏమిటి? ఆమెకు పిచ్చెక్కిందా? దగ్గరకుపోతే ఒకవేళ కత్తితో ఆమె పొడిచేసేలా ఉంది. అతను శబ్దం చేయకుండా మెల్లగా వెళ్లి తల్లిని లేపాడు. తిలోత్తమను ఆ రూపంలో గాని, భావంలోగాని అంతవఱకు చూడలేని ఆ అత్తగారికి కడుపులోనుంచి గుబులు బయలుదేరింది. అయినా కూడా మనస్స్థైర్యం కూడగట్టుకుని

''అమ్మా, తల్లీ, నీకేమైంది? ఏం పని చేస్తున్నావమ్మా'' అని ఆందోళనతో అడిగింది. తిలోత్తమ కత్తి కింద పారవేసి, పరుగెత్తుకొచ్చి, ఆమెను కౌగలించుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

''ఇలా ఏడ్వడానికి ఏం జరిగిందమ్మా. ఛీ, ఛీ ఇలా చిన్న పిల్లలా ఏడవ వద్దు'' అని తిలోత్తమ వీపు నిమురుతూ చెప్పింది. విషణ్ణ వదనంతో నిలబడిన కొండన్న ... ''ఉత్తమా! ఏడ్వకు, ఏడ్వకు'' అని ఆమె చేతిని పట్టుకొని చెప్పాడు.

''ఏడ్వకుండా నేను వేరే ఏం చేయాలి? నిన్న మధ్యాహ్నం వచ్చిన ఆ ఆడవాళ్లు నాగురించి, ఏమేమో అనగూడని మాటలు చెప్పారని మీకు తెలుసా అమ్మా! ఇక్కడ చూడండి ఈ రిక్షా వెనక ఇంగ్లీషులో, తెలుగులో పెద్దపెద్ద అక్షరాలలో ఏమి రాసి పెట్టి వుందో? తిలోత్తమ బాడుగకు వుందట. వాళ్ల భర్తలు, నారేటు ఎంత అని తెలుసుకోవడానికి, వాళ్లను పంపించారట. ఈ టౌన్లో వున్నవాళ్లందరూ, నా భర్తే నన్ను బాడుగకు ఇవ్వడానికి ప్రకటన చేశారని చెప్పి నవ్వుకున్నారట. నా గురించి ఇంత నీచంగా మాట్లాడడానికి నేనేం తప్పు చేశాను'' ఆమెలో ఏడుపు ఇంకా తీవ్రమయింది.

అప్పుడు కొండన్నకు, అతని తల్లికి సంగతంతా అర్థమయింది. భార్య పట్టుదల వల్ల స్వంత స్కూటరు అమ్మి, అప్పులు తీసుకొని, ఒక ఆటోరిక్షా కొనేటప్పుడు, ఆ ప్రేమ శిరోమణి అయిన భార్యకు, తన తిలోత్తమ నామధేయమే దానివెనుక, పెద్దగా, అందంగా రాసి పెట్టాలని అనిపించింది. మామూలుగా అన్ని రిక్షాలవాళ్లు ఇలాగే రాసి పెడుతూ వుంటారు. కాని, తన ప్రాణప్రేయసీ మధుర నామం ఇంగ్లీషులో మాత్రం రాసిపెడితే, తెలుగు మాత్రమే తెలిసిన వాళ్లు అది ఎలా తెలుసుకుంటారు? అందువలన, ఆ పేరు ఇంగ్లీషులో, తెలుగులో అందంగా రాసి పెట్టాడు. వేరే అన్ని ఆటో రిక్షాలపై వున్నట్లు ''ఫర్ హైర్'' అనే పదాలు ఇంగ్లీషులో తిలోత్తమకు కొంచెం క్రింద వ్రాసి పెట్టేటప్పుడు, తెలుగు తిలోత్తమ క్రింద ''బాడుగకు'' అని కూడా కలపడం జరిగింది. ఇందులో ఏమైనా తప్పుగా వుందని, ఎవ్వరూ అనుకున్నట్లు, ఇంతవరకు కొండన్న తెలుసుకోలేదు. విషయం గ్రహించడంతో అతను ''అయ్యో దీనికేనా ఉత్తమా ఏడ్చేది? ఏవరో ఏదో చెప్పి ఆట పట్టించిందానికేనా, ఇంత దుఃఖం? చూడు ఇప్పుడే ఇదంతా నేనే చెరిపేస్తాను'' అని చెప్పి కింద పడివున్న ఆ కత్తి తీసుకొని, ఆటో వెనుక వున్న అక్షరాలన్నీ మధ్యలో వున్న భాగాలన్నీ బాగా గీకేసి శుభ్రం జేశాడు. తరువాత ''చూడు, ఇటు చూడు ఉత్తమా, ఇక్కడ ఏమి రాసి పెట్టామో తెలుసుకోవడానికి ఎవరికీ సాధ్యం కాదు'' అని పూర్తి ధైర్యంతో, సంతృప్తితో చెప్పాడు.

''ఏమైనా గాని, మనకు ఈ ఆటో రిక్షా ఇంక వద్దు. ఈరోజే దీన్ని అమ్మేయాలి'' అని ఏడుపు ఆపిన తిలోత్తమ చివరి తీర్పు చెప్పింది.

''కాని... కాని...'' అని స్వరభంగంలో మొదలుపెట్టిన కొండన్నకు, మిగిలిన భాగం చెప్పడం అవసరం లేకుండా పోయింది.

''ఏలాంటి 'కాని' వద్దు! ఏ ఆడదానికి కూడా ఇంత పెద్ద అవమానం సహించడం సాధ్యం కాదు. ఈ అశ్రీకరము (దరిద్రం) ఈ ఇంటిముందు ఇంక వుండ కూడదు'' అని కరాఖండిగా చెబుతూ ఆమె లోపలికి వెళ్లిపోయింది.

కొండన్న తన వివాహ జీవితంలో ఒక్కసారి గూడా తిలోత్తమ అభిప్రాయాలకు విరుద్ధంగా ఎలాంటి పని చేయలేదు. కాని, ఈ ఆటోరిక్షా విషయంలో మాత్రం ఆమెకు తెలియకుండా ఒక పెద్ద పని చేయాల్సి వచ్చింది. వెనక భాగంలో గీకి గీకి వికృతంగా వుండే ఆ వాహనాన్ని అంత యమ అర్జంటుగా అమ్మాలంటే పెద్ద నష్టం వస్తుంది. అలా కాకున్నా, ఆటోరిక్షాలకు ''సెకెండ్ హ్యాండ్'' ధర కొంచెం తక్కువగానే వుంటుంది. నెల రోజులనుంచి రాత్రనక పగలనక వందశాతం నిర్మలమైన మనస్సుతో కష్టపడి పని చేస్తున్న డ్రైవరు ఆంజనేయులును ఒకేసారి ఉద్యోగం నుండి తీసేయడం కూడా న్యాయం కాదు. అందువల్ల అతను తన బుద్ధినంతా ఉపయోగించి ఒకదారి కనిపెట్టాడు. ఆ ఆటోరిక్షా ఇప్పటినుంచి తన ఇంటి ముందు పెట్టకుండా వుంటే చాలు కదా. ఆంజనేయులు ఇంటి ముందు దాన్ని పెట్టుకోమని చెప్పి, దాని వెనక ఇంగ్లీషులో మాత్రం ''శ్రీవెంకటేశ్వర'' అని రాసి పెట్టడం జరిగింది. అయితే తిలోత్తమతో మాత్రం అతను ఇలా చెప్పాడు -

''ఆటో పాపం ఆ ఆంజనేయులకే ఇచ్చాను. అతను ఆ డబ్బు మనకు వాయిదాల్లో మెల్లగా ఇస్తాడు.''

భార్యకు అతను ఇలా ఒక చిన్న అబద్ధం చెప్పాలనిపించడం, ఆమెమీద అతనికున్న ప్రేమకు కొద్దిగ కూడా లోపం రావడం వల్లకాదు, ప్రాణప్రియ తనను బావిలో దూకమన్నా దూకుతాడు. కాని, ఈ సమస్యనుంచి బయట పడాల్సిన ఉపాయం కాని, ఆదాయం తగ్గని మరో ఉపాధి కాని అవలంభించిన తరువాత మాత్రమే.

---